వలంటీర్లు కుటుంబ సభ్యులే


వలంటీర్లకు ప్రోత్సాహక పురస్కారాలు అందజేస్తున్న ఆర్టీసీ జోన్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, టిడ్కో డైరెక్టర్ రాఘవరావు, కమిషనర్ ప్రకాశరావు


కంకిపాడులో వలంటీర్లను సత్కరిస్తున్న జెడ్పీటీసీ బాకీ బాబు, ఇతర ప్రజాప్రతినిధులు

ఆర్టీసీ జోన్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి

పెనమలూరు: గ్రామ/వార్డు వలంటీర్లు కుటుంబ సభ్యులేనని, సమాజంలో అన్ని వర్గాల వారికి చిత్త శుద్ధితో అవినీతి రహితంగా సేవలు అందిస్తున్నారని ఆర్టీసీ జోన్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి కొనియాడారు. తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో కానూరు యార్లగడ్డ గ్రాండియర్‌లో శుక్రవారం వలంటీర్లకు ప్రోత్సాహక పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా తాతినేని పద్మావతి మాట్లాడుతూ జగనన్న సీఎం అయిన వెంటనే వలంటీర్ల వ్యవస్థను ప్రకటించారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందించటానికి వలంటీర్ల సేవలు ఉపయోగపడుతున్నాయని వివరించారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా నేడు రాష్ట్రంలో వలంటీర్ల వ్యవస్థ ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. జగనన్న ఆశయాలకు అనుగుణంగా నేడు వలంటీర్లు చిత్తశుద్ధితో ప్రజలకు ఉన్నత సేవలు అందిస్తున్నారని తెలిపారు. అయితే ప్రతిపక్ష టీడీపీ వలంటీర్లను చులకన చేస్తూ అవమానకరంగా విమర్శలు చేయటాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. గతంలో జన్మభూమి కమిటీలతో దోచుకున్న తెలుగుతమ్ముళ్లు ప్రజలను నానా ఇబ్బందులకు గురి చేశారన్నారు. వలంటీర్లకు సమాజంలో ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలన్నారు. వలంటీర్లకు ప్రోత్సాహక పురస్కారాలు అందజేశారు. కమిషనర్ ఎస్.ప్రకాశరావు మాట్లాడుతూ తాడిగడప మున్సిపాలిటీలో ఐదుగురు వలంటీర్లకు సేవా రత్న అవార్డులు వచ్చాయని, 502 మంది వలంటీర్లకు సేవా మిత్ర అవార్డులు వచ్చాయన్నారు. వీరికి మొత్తం రూ. 51.20 లక్షల సొమ్ము ప్రభుత్వం ప్రోత్సాహకం కింద అందజేసిందని తెలిపారు. కార్యక్రమంలో టిడ్కో డైరెక్టర్ పి.రాఘవరావు, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ ఈడే చాముండేశ్వరి, వైఎస్సార్ సీపీ నేతలు వెలగపూడి వరప్రసాద్, గుమ్మడి విజయ్‌కుమార్, యార్లగడ్డ వీరబాబు, మరీదు శ్రీనివాసరావు, వేమూరి బాలకృష్ణ, తాళ్ల నరేంద్ర, సిద్ధిఖ్, ఖాదర్, కటికల క్రిష్టోఫర్, వెలిశిల ప్రసాద్, నల్లమోతు జీవన్, వలంటీర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి వారథులు వలంటీర్లు

కంకిపాడు: అభివృద్ధి వారథులు వలంటీర్లు అని జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు అన్నారు. కంకిపాడు మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో వలంటీర్లను శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఇరువురికి సేవా వజ్ర, ఐదుగురికి సేవా రత్న, 316 మందికి సేవా మిత్ర అవార్డులను అందించి సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో జెడ్పీటీసీ బాకీ బాబు మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు వారథులుగా వలంటీర్లు నిలుస్తున్నారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులందరికీ చేరువ చేస్తూ నిస్వార్థంగా సేవ చేస్తున్నారన్నారు. వలంటీర్ల సేవను గుర్తించి ప్రభుత్వం సత్కరించటం మంచి పరిణామమన్నారు. ప్రతిపక్షాలు ప్రభుత్వంపై బురద చల్లటమే లక్ష్యంగా పనిచేస్తున్నాయన్నారు. ఎల్లో మీడియా విష ప్రచారాలను ప్రజలు తిప్పికొట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, జగనన్న సచివాలయాల మండల ఇన్‌చార్జి రాచూరి చిరంజీవి, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ రామినేని రమాదేవి, అగ్రిబోర్డు చైర్మన్ చాట్ల విజయ్‌బాబు, మాజీ చైర్మన్ సత్తా వెంకటేశ్వరరావు, చిట్టూరి వరప్రసాద్, షేక్ అమీనాబి, దుర్గగుడి బోర్డు మాజీ సభ్యుడు నెరుసు సతీష్, ఇన్‌చార్జి ఎంపీడీఓ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.


మానికొండలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎంపీపీ, ఎంపీడీవో

ప్రజల ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు

ఉంగుటూరు: ప్రజల ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను అందజేస్తూ వలంటీర్లు అందరి ప్రశంసలు పొందుతున్నారని ఎంపీపీ సరోజిని అన్నారు. మానికొండ సచివాలయంలో శుక్రవారం 35 మంది వలంటీర్లకు ఉత్తమ సేవా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా వలంటీరు వ్యవస్థ ద్వారా క్షేత్రస్థాయిలో అర్హులకు సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని అన్నారు. వలంటీర్లు మరింత ఉత్సాహంతో తమ సేవలను కొనసాగించాలన్నారు. అనంతరం 35 మంది వలంటీర్లకు సేవా మిత్ర, ఒకరికి సేవారత్న అవార్డులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వీరంకి కుసుమ, ఎంపీడీవో శేషగిరిరావు, ఈవోపీఆర్‌డీ బాషా, కార్యదర్శి కిశోర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కంకిపాడు: విద్యుత్ మరమ్మతుల రీత్యా పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ గుణదల ఈఈ పి.హరిబాబు తెలిపారు. శుక్రవారం ఆయన వివరాలు తెలుపుతూ కంకిపాడు సబ్ స్టేషన్‌లో ఈనెల 27న మరమ్మతులు నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. కంకిపాడు, పునాదిపాడు, గొల్లగూడెం, గొడవర్రు లిక్కర్ కంపెనీ ప్రాంతాల ప్రజలు ఈ మార్పును గమనించాలని విజ్ఞప్తి చేశారు.

గన్నవరంలో..

గన్నవరం: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం గన్నవరం సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ రాయ్‌నగర్ ఫీడర్‌కు శనివారం ఉదయం 7 నుంచి 10 గంటలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ గుణదల కార్యనిర్వాహక ఇంజనీర్ పి.హరిబాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాయ్‌నగర్ ఫీడర్‌లోని హరిజనవాడ, ఉపాధ్యాయ నగర్, చర్చి రోడ్డు, రీచ్ రోడ్డు, రాయ్‌నగర్, రామ్ నగర్, బీఎస్ఎన్ఎల్ ఆఫీస్, తహసీల్దారు కార్యాలయం ఏరియా, గాంధీబొమ్మ సెంటర్, బుద్ధవరం రోడ్డు, గొడపేట, వీనస్ బజార్, ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంతాల్లో పైన తెలిపిన సమయాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించవలసిందిగా ఆయన కోరారు.

దాడిలో గాయపడిన వ్యక్తి మృతి

పెనమలూరు: తాడిగడపలో గత కొద్ది రోజుల క్రితం జరిగిన దాడిలో గాయపడిన వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప రామానగర్‌కాలువ కట్టపై గజ్జల నరేష్‌కు ఇంటి పక్కనే ఉంటున్న సుబ్రహ్మణ్యం అనే వ్యక్తికి బైక్ పార్కింగ్ విషయమై ఈ నెల 16వ తేదీన ఘర్షణ జరిగింది. ఈ ఘటనలో సుబ్రహ్మణ్యం విచక్షణారహితంగా నరేష్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. అతనిని అత్యవసర వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌లో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతున్న అతను మృతి చెందాడు. మృతుడి సోదరి పులిభాగ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు హత్య కేసు నమోదు చేశారు.

అత్తింటివారిపై వరకట్నం వేధింపుల కేసు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెదపులిపాక గ్రామానికి చెందిన కె.కృష్ణకుమారి గత 14 ఏళ్ల క్రితం అనంతపురానికి చెందిన ఓబుల్‌పతిని ప్రేమ వివాహం చేసుకుంది. అయితే ఇప్పుడు తనకు వరకట్నం కావాలని భర్తతో పాటు అత్త ఆదిలక్ష్మి, మామ ఓబులేషు, మరిది హరికృష్ణ, ఆడపడుచు వర్ల కుమారి వేధింపులకు గురి చేయటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేశారు.

విద్యార్థులకు పాటల పోటీలు




కంకిపాడు: వేసవి శిక్షణ తరగతులు ఉత్సాహంగా సాగుతున్నాయి. వేసవి శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా కంకిపాడు శాఖ గ్రంథాలయంలో శుక్రవారం విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు. పలు క్రీడా పోటీలు నిర్వహించి విద్యార్థులను ఉత్సాహ పరిచారు. గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ, రైల్వే సూపరింటెండెంట్ కటికల రాంబాబు పోటీలను పర్యవేక్షించారు. తెన్నేరు శాఖ గ్రంథాలయంలో స్పోకెన్ ఇంగ్లిష్‌పై శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తెన్నేరు పరిసరాలకు చెందిన విద్యార్థులు స్పోకెన్ ఇంగ్లిష్, గణితంపై శిక్షణ తీసుకున్నారు. కథలు చెప్పటం, చదివించటం, కథల్లో నీతిని తెలియజెప్పటంపై శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయాధికారి ఎస్. సునీత పోటీలను పర్యవేక్షించారు.

వైభవంగా శాంతి కల్యాణం



భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలో ఇటీవల ప్రతిష్ఠోత్సవం జరిగిన అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం 16 రోజుల పండుగ కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. గ్రామంలోని 36 జంటలు పీటలపై కూర్చోగా నూతన ఆలయంలో ఉత్సవ మూర్తులకు శాస్త్రోక్తంగా శాంతి కల్యాణం జరిపించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పూషడపు నిరంజనరావు, శివసత్యవతి దంపతులు, నాగాయలంక పీఏసీఎస్ అధ్యక్షుడు ముమ్మారెడ్డి వెంకట సాంబశివరావు, మెండు భాస్కరరావు, ముమ్మారెడ్డి సత్యనారాయణ, భోగాది మురళి, మలిశెట్టి మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరునికి గరుడ వాహన సేవ



పెనమలూరు: తాడిగడపలో శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గ్రామంలో రెండో రోజు శుక్రవారం గరుడవాహనం సేవ భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, కుంభారాధన, నిత్యహోమం, బలిహరణ తదితర పూజా కార్యక్రమాలు చేశారు. తాడిగడప గ్రామంలోని పురవీధుల్లో గరుడోత్సవం కనుల పండువగా జరిగింది. భక్తులు స్వామివారి ఆశీస్సుల కోసం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కాగా శనివారం ఉదయం సహస్రకలశాభిషేకం, దివ్య తిరు విశేష కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామని ఆలయ కమిటీ తెలిపింది.

ప్లాస్టిక్ వలన కలిగే అనర్థాలపై అవగాహన



ఉంగుటూరు: ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే అనర్థాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగినపుడే ప్లాస్టిక్ రహిత సమాజం సాధ్యమవుతుందని ఎంపీపీ సరోజిని అన్నారు. మానికొండ గ్రామంలో మిషన్‌లైఫ్ నిర్వహించిన ప్రచారంలో భాగంగా ఎంపీపీ శుక్రవారం ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే అనర్థాలపై మాట్లాడారు. ప్లాస్టిక్ ఎక్కువగా వినియోగించడం వలన కాలువలు పూడుకుపోవడం, పర్యావరణ సమస్యలు ఏర్పడతాయని చెప్పారు. క్యారీ బ్యాగులు కాకుండా చేతి సంచులను ఉపయోగించాలని సూచించారు. అనంతరం పలువురికి జ్యూట్ బ్యాగ్స్ పంపిణీ చేశారు. సర్పంచ్ నిమ్మకూరి స్వర్ణలత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వీరంకి కుసుమ, ఎంపీటీసీ ముత్తయ్య, ఎంపీడీవో శేషగిరిరావు, ఈఓపీఆర్‌డీ బాషా, కార్యదర్శి రత్నకిశోర్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి


పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అటవీ శాఖాధికారులు

మచిలీపట్నంటౌన్: పర్యావరణ పరిరక్షణకు విద్యార్థి దశ నుంచే కృషి చేయాలని అటవీ శాఖ డెప్యూటీ రేంజ్ ఆఫీసర్లు ఎం. వెంకటేశ్వరరావు, ఎం. శ్రీనివాసరావు అన్నారు. స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొని విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు.

విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని, తద్వారా వాతావరణ సమతుల్యతను కాపాడుకోవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. తొలుత శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు కోలాటం, రన్నింగ్ గేమ్స్ ఆడారు. భగవద్గీత శ్లోకాలు, ధ్యానం, యోగా చేయించారు. నగరంలోని ఈడేపల్లి, చిలకలపూడి గ్రంథాలయాల్లో కూడా విద్యార్థులకు పలు అంశాల్లో శిక్షణ ఇచ్చారు. ఉప గ్రంథాలయాధికారి ఎంవీడీటీ నగేష్ పర్యవేక్షించారు.

విద్యార్థుల్లో ప్రతిభ వెల్లడికి చిత్రలేఖనం పోటీలు



గన్నవరంరూరల్: చిత్రలేఖన పోటీలతో విద్యార్థులలోని ప్రతిభ వెల్లడి అవుతుందని ముస్తాబాద గ్రంథాలయం లైబ్రేరియన్ కె.జ్యోతికుమారి అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా శుక్రవారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. విజేతలను అభినందించారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక


మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ హారిక

మొవ్వ: ప్రజా సమస్యలను అధికారులు, ఎమ్మెల్యే, ఎంపీ, జెడ్పీ చైర్ పర్సన్ల దృష్టికి తీసుకు రావటమే కాకుండా వాటి పరిష్కారానికి చొరవ చూపాల్సిన బాధ్యత ఎంపీటీసీలు, సర్పంచ్‌లపై ఉందని కృష్ణా జిల్లా చైర్ పర్సన్ ఉప్పాల హారిక రాము సూచించారు. మండల కేంద్రం మొవ్వలో శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశానికి పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్‌తో కలిసి జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు ఆయా శాఖల ప్రగతిని, అందిస్తున్న సంక్షేమాన్ని వివరించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ హారిక మాట్లాడుతూ దేశంలోని 28 రాష్ట్రాలో ఎక్కడా లేని విధంగా సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ప్రవేశ పెట్టి సంక్షేమ పథకాల అమలులో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారన్నారు. అభివృద్ధి అంటే అద్దాలసౌధాలు కాదని, ప్రతి వ్యక్తి, కుటుంబానికి సంక్షేమాలు అందించి తద్వారా వ్యక్తి, కుటుంబం, గ్రామాలు, జిల్లాలు అలా రాష్ట్రాభివృద్ధి సాధిస్తేనే నిజమైన అభివృద్ధి అన్నారు. పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని, మెడికల్ అండ్ హెల్త్ అధికారులు గైర్హాజరు అవ్వటంపై అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కొండేటి ఇందిర, జెడ్పీటీసీ రాజులపాటి పార్వతి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు వేమూరి పరిశుద్ధరాజు, ఎంపీడీవో జి.సుధాప్రవీణ్, తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

కోనలో గాలివాన బీభత్సం


గాలివానకు ఇల్లు కూలిపోయిన బాధితురాలిని పరామర్శిస్తున్న పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: బందరు మండలం కోన గ్రామంలో గురువారం అర్ధరాత్రి వర్షంతో పాటు వీచిన గాలులు బీభత్సాన్ని సృష్టించాయి. గ్రామంలోని పలు గృహాల పై కప్పులు గాల్లోకి ఎగిరాయి. మరి కొన్ని గృహాల గోడలు పాక్షికంగా దెబ్బ తిన్నాయి. బాధితులు పలువురు ఇళ్లను వదిలి పక్క ఇళ్లల్లోకి వెళ్లి తలదాచుకున్నారు. గ్రామస్తులు ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. దీంతో గ్రామస్తులంతా ఊపిరి పీల్చుకున్నారు. విషయాన్ని తెలుసుకున్న జిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, వైఎస్సార్ సీపీ జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) శుక్రవారం గ్రామానికి వెళ్లి గృహాలను పరిశీలించారు. బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అధైర్యపడొద్దు.. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి బాధితులందరికీ సత్వర సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అప్పటి వరకు అందరూ గ్రామంలోని పాఠశాలలో తలదాచుకునేందుకు అవకాశం కల్పించారు. అక్కడే అందరికీ భోజన వసతి ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా పేర్ని కిట్టు మాట్లాడుతూ నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం తరపున సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. జేసీ అపరాజితసింగ్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి సత్వర న్యాయం జరిగేలా తమ వంతు కృషి చేస్తామన్నారు. బందరు ఆర్డీఓ ఐ కిషోర్, తహసీల్దార్ డి. సునీల్‌బాబును గ్రామానికి పిలిచి తక్షణమే బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని జేసీ అపరాజిత్‌సింగ్, పేర్ని కిట్టు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ తిరుమాని నాగేశ్వరమ్మ, రెవెన్యూ, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డికి కృతజ్ఞతలు


మంత్రి పెద్దిరెడ్డికి అభినందన పత్రం అందజేస్తున్న నేతలు

గన్నవరం: రాష్ట్ర ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా గృహ, వాణిజ్య అవసరాలకు, వ్యవసాయ బోర్లకు, పరిశ్రమలకు నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్న రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం విమానాశ్రయంలో పెద్దిరెడ్డిని కలిసిన పార్టీ నాయకులు ఆకుల శ్రీనివాస్‌కుమార్, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, కార్పొరేటర్ బి.జానారెడ్డి తదితరులు అభినందన లేఖను అందజేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రోజుకు రెండు నుంచి మూడు సార్లు గృహాలకు విద్యుత్ కోతలతో ప్రజలు అల్లాడిపోయారని చెప్పారు. వారానికి ఒకరోజు పవర్ హాలిడే ప్రకటించడం వల్ల ఉత్పత్తులు చేయలేక పరిశ్రమలు మూతపడే పరిస్థితి ఉండేదన్నారు. వ్యవసాయానికి సరైన సమయంలో విద్యుత్ సరఫరా చేయకుండా రైతులను టీడీపీ ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేసిందని గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గత నాలుగేళ్లుగా నిత్యం అధికారులతో సమీక్షలు జరుపుతూ నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా నిప్పులు చెరిగే ఎండాకాలంలో కూడా అవసరానికి మించి విద్యుత్ ఉత్పత్తి చేయడంతో పాటు ప్రజలకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డితో పాటు ఆ శాఖ అధికారులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకులు పొదిలి చంటిబాబు, మైనార్టీ సెల్ నాయకులు సలీం పర్వేస్, పార్టీ నేతలు అల్లం పూర్ణచంద్రరావు, పెద్దిరెడ్డి శివారెడ్డి, వై. మురళి, మేళం చిన్నా, వేదాంతం చైతన్య తదితరులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన


గంగూరులో రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

పెనమలూరు: గంగూరులో రూ. 53 లక్షలతో రహదారుల నిర్మాణానికి వైఎస్సార్ సీపీ నేతలు, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు శుక్రవారం ప్రత్యేక పూజలు చేసి, శంకుస్థాపన చేశారు. గ్రామ వైఎస్సార్ సీపీ నేత, మాజీ ఎంపీటీసీ సభ్యుడు అక్బర్ పాషా మాట్లాడుతూ గ్రామంలో 9వ వార్డులో రెండు సీసీ రోడ్ల నిర్మాణం చేయటానికి ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి రూ. 53 లక్షల నిధులు మంజూరు చేశారన్నారు. ఇందులో గ్రామ పంచాయతీ రూ. 10 లక్షలు కాంట్రిబ్యూషన్ ఉందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదలు నివసించే ప్రాంతాల్లో శరవేగంగా అభివృద్ధి పనులు చేస్తుందని వివరించారు. గ్రామంలో మరిన్ని అభివృద్ధి పనులు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అండదండలతో చేపడతామన్నారు. గ్రామస్తులకు ఇచ్చిన హామీలు నెరవేర్చుతామన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు జనార్దన్, ఎండీ రహీం, అబ్దుల్ గని, బంగారు నాగేంద్రబాబు, అన్వర్‌బాషా, చేబ్రోలు పావని, అజీజుల్లా ఖాన్, ఎండీ. షరీఫ్, పి.రాజేష్, చిట్టూరి సుబ్బారావు, వల్లూరి ఏషయ్య, వేంపాటి నాగరాజు, బి.గాబ్రేలు, రాజేశ్వరరావు, జె.రమేష్, పి.బాబూరావు పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించుకోవాలి


మద్దూరులో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి రంగారావు

కంకిపాడు: ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించుకోవాలని కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.రంగారావు పిలుపునిచ్చారు. మండలంలోని మద్దూరు గ్రామంలో కౌలురైతు సంఘ ప్రతినిధులు శుక్రవారం పర్యటించారు. గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద పనులు చేస్తున్న కూలీలతో మాట్లాడారు. రంగారావు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకానికి కేటాయించే నిధులు కుదిస్తున్నారని, వసతులను అరకొరగా కల్పిస్తున్నారన్నారు. ఉపాధి పథకాన్ని పూర్తిగా ఎత్తివేసేందుకు కేంద్రం యత్నిస్తుందన్నారు. ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేసే కేంద్ర ప్రభుత్వ చర్యలను తిప్పికొట్టాలన్నారు. ఈనెల 29న జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పీతా నాగేశ్వరరావు, ఒడుగు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

స్వామిత్వలో పొరపాట్లకు తావులేకుండా చర్యలు

స్వామిత్వ రాష్ట్ర ప్రత్యేకాధికారి డాక్టర్ సిరి


అధికారులతో మాట్లాడుతున్న డాక్టర్ సిరి

పెడన: స్వామిత్వ ద్వారా భూ లావాదేవీలు పారదర్శకంగా నిర్వహించుకునేలా కేంద్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటోందని, అందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 200 గ్రామాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి రీ సర్వే చేసి రికార్డులను తయారు చేసిందని స్వామిత్వ రాష్ట్ర ప్రత్యేకాధికారి డాక్టర్ సిరి అన్నారు. శుక్రవారం ఉదయం ఆమె డీపీఓ నాగేశ్వరనాయక్‌తో కలిసి పెనుమల్లి గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. పెడన మండలంలో పైలట్ ప్రాజెక్టులుగా నేలకొండపల్లి, కుమ్మరిగుంట గ్రామాల్లో స్వామిత్వ పూర్తి కావడంతో వాటికి సంబంధించిన రికార్డులను, మ్యాపింగ్, డ్రోన్ కెమెరాలతో స్వీకరించిన ఫొటో ఇమేజ్‌లు తదితర వాటిని పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ సిరి మాట్లాడుతూ కేంద్ర బృందం స్వామిత్వను పరిశీలించేందుకు రానుందని చెప్పారు. స్వామిత్వ వల్ల ప్రస్తుతం ఉన్న భూముల సరిహద్దులు, ఎవరి ఆస్తులు అనే విషయంలో స్పష్టత వస్తుందన్నారు. పూర్వీకుల ఆస్తులున్నా వాటికి సంబంధించి ఆధారాలను పరిశీలించిన అనంతరం పూర్తి హక్కుదారులైన వారికి రికార్డులు లేకపోయినా స్వామిత్వ వల్ల రికార్డులు కూడా దక్కుతాయని చెప్పారు. బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకోవడం సులభతరమవుతుందన్నారు. స్వామిత్వ ఉపయోగాలను వివరించారు. జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వరనాయక్ మాట్లాడుతూ కృష్ణా జిల్లాలో 40 గ్రామాలను స్వామిత్వకు పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారని చెప్పారు. పూర్తిస్థాయిలో రికార్డులు తయారు చేశామని, ఆన్‌లైన్ చేస్తామని చెప్పారు. రానున్న కాలంలో పూర్తిస్థాయిలో వెబ్‌సైట్ ద్వారానే లావాదేవీలు, క్రయవిక్రయాలు జరుపుకునేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు. మచిలీపట్నం డీఎల్‌పీఓ జ్యోతిర్మయి, పెనుమల్లి, నేలకొండపల్లి సర్పంచ్‌లు గరికిపాటి వెంకట రామానాయుడు, వుచా వెంకటేశ్వరరావు, ఈఓపీఆర్డీ జయరామ్, సచివాలయ సర్వేయర్లు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధి శిక్షణతో యువతకు ఉపాధి



అవనిగడ్డ: నైపుణ్యాభివృద్ధి శిక్షణ ద్వారా యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తాయని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఎస్.శ్రీనివాసరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ ద్వారా డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, హేచరీ ప్రొడక్షన్ వర్కర్ కోర్సుల్లో 52 మంది శిక్షణ పూర్తి చేసుకున్నారు. వారికి కళాశాలలో జిల్లా అధికారి శ్రీనివాసరావు, ఎంపీడీఓ షేక్ అతావుల్లా ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.ఉమారాణి, కళాశాల ఎస్‌పీఓసీ ఎం.రామారావు, ట్రైనర్ బి.జయసాయి, పృథ్వీజ, ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు.